క్లుప్తంగా

టీకాల కార్యక్రమం తనిఖీ



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జయశంకర్

పలమనేరు: మున్సిపాలిటీలో చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని స్థానిక సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈనెల 16 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఇంటింటికి వచ్చే సిబ్బందికి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను విధిగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది ఇంద్రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మృతి



తులసీనాయక్(ఫైల్)

రామకుప్పం: మండలంలోని పెద్దతండా పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ తులసీనాయక్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ మోహన్‌నాయక్, రెస్కో డైరెక్టర్ రవినాయక్, నేతలు చంద్రారెడ్డి, భాస్కర్ నాయక్, చిన్నరాజునాయక్ సంతాపం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి



రెడ్డిశేఖర్ రాజు (ఫైల్)

రొంపిచెర్ల: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని పెద్దమల్లెల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిశేఖర్ రాజు(61) వారం రోజులుగా ఆరోగ్యం సరిగా లేదని మంగళవారం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. అక్కడ ఆరోగ్య పరీక్షలలో మధుమేహం వ్యాధి బయట పడింది. ఆ వ్యాధి తీవ్రం కావడంతో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కన్నుమూశాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండు నెలల క్రితమే పెద్దమల్లెలకు బదిలీపై ఆయన వచ్చారు. ఆయన మృతికి ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు మృతుని స్వగ్రామమైన పులిచెర్ల మండలం కోడిదిపల్లెలో నిర్వహించనున్నట్టు మృతుని బంధువులు తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ



బీమా సాయం అందజేస్తున్న నాయకులు, అధికారులు

సదుం: స్థానిక వీఆర్ఆర్ కాలనీకి చెందిన శాంతమ్మ ఇటీవలే మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలను జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ ఉషారాణి, ఈఓ హసీనా, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు శుభ్రంగా ఉండాలి

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వ పాఠశాలలు శుభ్రంగా ఉన్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. పులిచెర్ల హైస్కూల్లో బుధవారం పాఠశాలల పారిశుద్ధ్య కార్మికులకు పారిశుద్ధ్య సామగ్రి పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పాఠశాలలో టాయ్‌లెట్‌లతోపాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణెమ్మ, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, నాదమునిరెడ్డి, హెచ్‌ఎం సూర్యనారాయణ, ప్రసాద్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా అబ్దుల్ రహీమ్



పెద్దపంజాణి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.అబ్దుల్ రహీమ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో ఏఓగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

పెద్దపంజాణి: ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని బీఎల్వో సుధాకర్ కోరారు. బుధవారం మండలంలోని కోగిలేరు సచివాలయంలో అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలు 45, 46లో మరణించిన, వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీ ఓటర్ల వివరాలను బూత్ లెవల్ ఏజెంట్లు గుర్తించి బీఎల్వోలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, బీఎల్వో నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా లబ్ధి



చౌడేపల్లె : నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి తదితరులు



హాజరైన నూతన పెన్షనుదారులు

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- నూతన పింఛన్ల పంపిణీలో వైఎస్సార్ సీపీ నేతలు

చౌడేపల్లె: కులమతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తోందని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. అలాగే అభివృద్ధికీ ప్రాధాన్యత ఇస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తదితరులు పంపిణీ చేసి మాట్లాడారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పెన్షన్లు ఇచ్చేవారని, ఇప్పుడు అలాకాకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి అర్హతను బట్టి మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు మండలంలో 6,383 మందికి పంపిణీ చేస్తుండగా, కొత్తగా 297 మందికి మంజూరు చేశారన్నారు. పుంగనూరు నియోజవర్గాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పలు పనులతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని వాటి గురించి పెద్దిరెడ్డి ఉదహరించారు. కెలవాతికి చెందిన ఓ కుటుంబం 30 ఏళ్ల పాటు పుంగనూరును పాలించినా వాళ్ల జేబులు నింపుకోవడం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. టీడీపీ పాలనకు, తమ ప్రభుత్వ పాలనను బేరీజు వేస్తున్న ప్రజలు ఏ ప్రభుత్వం బాగా మేలు చేసిందో ఇట్టే చెబుతున్నారన్నారు. ఇంతగా చేస్తున్నా ప్రభుత్వం, సీఎంపై దుష్ప్రచారం చేస్తున్న ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, రెడ్డి ప్రకాష్, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, సింగిల్‌విండో చైర్మన్ రవి చంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీతో పాటు మండలంలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో పంపిణీ చేశారు. మదనపల్లె రోడ్డు సచివాలయంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి మురళీకృష్ణ, గంటావూరు సచివాలయంలో పట్టణ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్ షర్మిల పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని సముద్రపల్లె సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సర్పంచ్ తిరుమలేష్, అలాగే బయ్యప్పగారిపల్లె, టి.వడ్డూరు, మున్సిపాలిటీలోని గంటావూరులోనూ కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు జాఫర్, బాలాజీ నాయుడుతో పాటు సర్పంచ్ మునస్వామి, వార్డు వెల్ఫేర్ కార్యదర్శి మురళీనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం మండలంలో..

గంగవరం: ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్లను మండలంలోని పలు సచివాలయాల పరిధిలో బుధవారం పంపిణీ చేశారు. దండపల్లె :13, గండ్రాజుపల్లె1, 2 సచివాలయాలలో 29, గంగవరం1, 2, 3లలో 40, గుండుగల్లు: 13, జీడిమాకులపల్లె:7, కలగటూరు: 9, కల్లుపల్లె:16, కీలపల్లె:11, కీలపట్ల: 29, కొత్తపల్లె: 36, మామడుగు: 29, మేలుమాయి: 25, పసుపత్తూరు: 10, పత్తికొండ: 9, తాళ్లపల్లె: 5 చొప్పున మొత్తం 281 పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసింది. సెప్టెంబర్ నెల మొదటి తేదీన 179 పింఛన్లు మంజూరవగా, రెండవసారి ఏకంగా 281 పింఛన్లు మంజూరు చేయడం విశేషం! కల్లుపల్లెలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వైస్ ఎంపీపీ ఉమాదేవి, కొత్తపల్లెలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, గోపిక్రిష్ణ, విజయ్, చిట్టి, శివన్న, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పులిచెర్ల మండలంలో 214 పింఛన్లు..

పులిచెర్ల(కల్లూరు): అర్హులందరికీ పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. మండలంలో కొత్తగా మంజూరు చేసిన 214 సామాజిక పింఛన్లను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పంపిణీ చేసి మాట్లాడారు. గత తెలుగు దేశం హయాంలో ఎవరైనా చనిపోతే తప్ప మరొకరికి పింఛన్ మంజూరు చేసేవారు కాదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పింఛన్లు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మురళీధర్, జిల్లా వైఎస్సార్ సీసీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, నాదమునిరెడ్డి, ముర్వత్‌బాషా, నాగరాజ ప్రసాద్, వైస్ ఎంపీపీ ఈశ్వరి, పోకల చంద్ర, సర్పంచ్ రాణెమ్మ, షకూర్, రెడ్డి అహమ్మద్, ప్రభాకర, దామోదర్, ఎంపీడీఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు : టి. వడ్డూరులో..



పలమనేరు : బయ్యప్పగారిపల్లెలో..

జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



వి.కోట: 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్న జగనన్న ప్రభుత్వానికి తామెప్పుడూ రుణపడి ఉంటామని నూతన పింఛనుదారులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలో సచివాలయం-1లో వి.కోట మేజర్ పంచాయతీలో నూతనంగా మంజూరైన 94 మందికి సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఒకటవ తేదీ నూతనంగా 70 మందికి పింఛన్లు మంజురయ్యాయని, కొత్తగా ఇప్పుడు 94 మందికి మంజూరైనట్లు పంచాయతీ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, జూనియర్ కళాశాల కమిటీ చైర్మన్ అమరనాథ్, ఈఓ యాదవపతి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



పలమనేరు : సముద్రపల్లెలో..



పులిచెర్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



గంగవరం : కొత్తపల్లెలో..



పలమనేరు : గంటావూరులో..

బోస్ ఈజ్ బ్యాక్!



బైపాస్ రోడ్డులో మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

- మళ్లీ మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు
- బీటలు బారిన టీడీపీ?

పలమనేరు: పూర్వ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో మాజీ మంత్రి అమరనాథ రెడ్డిపై ఓటమి చెందిన మాజీ టీడీపీ నాయకుడు, పట్టణ సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్వీ సుభాష్ చంద్రబోస్ బుధవారం బైపాస్ రోడ్డులో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డితో కలసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. ఇది చర్చనీయాంశమైంది. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఇన్‌చార్జిగా బోస్ కృషి చేశారు. అయితే అమరనాథ రెడ్డి ఆయన్ను చిన్నచూపు చూడడంతోపాటు పార్టీలోనూ నాయకుల వద్ద విలువ లేకుండా చేయడంతో ఆయన ఆ పార్టీకి దూరమయ్యారు. 2019 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని ఆయన ప్రకటించినప్పటికీ చంద్రబాబు హామీతో పోటీ నుంచి తప్పుకున్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అమరనాథ రెడ్డిపై అతి సామాన్యుడైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ 33వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించడం విదితమే. వాస్తవానికి గతంలోనే అప్పట్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బోస్ కలిశారు. ఆయన ఎక్కడ వైఎస్సార్ సీపీలోకి జంప్ అవుతారో అనే భయంతో అమరనాథ రెడ్డి ఆడిన రాజకీయ నాటకంలో బోస్ బలిపశువు అయ్యారు. అయినప్పటికీ ఆయన తనకంటూ ఓ బలమైన వర్గాన్ని కలిగి ఉండటం, ఈ నేపథ్యంలో ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కలయిక రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మేలు చేస్తుందనే చర్చకు దారితీసింది.

15న మండల సమావేశం

పుంగనూరు: పుంగనూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసిన ఢిల్లీ బృందం

- చిన్నపిల్లల విభాగం సేవలపై సంతృప్తి



పలమనేరు ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ముస్కాన్ అసెస్‌మెంట్ కమిటీ సభ్యులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్య విభాగాన్ని ఢిల్లీ నుంచి వచ్చిన ముస్కాన్ అసెస్‌మెంట్ కమిటీ బుధవారం తనిఖీ చేసింది. ఇక్కడి ఎన్‌బీఎస్‌యూ(న్యూబార్న్ స్టెబిలైజేషన్ యూనిట్) సేవలను నిశితంగా పరిశీలించింది. వార్డులో ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారు? పిల్లలు, తల్లుల శుభ్రత, వార్డులో పరిశుభ్రతను గమనించారు. రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఇక్కడికి నవజాత శిశువుల ఓపీ ఎలా ఉంది? ఆ శిశువులకు అందుతున్న అత్యవసర సౌకర్యాలను తెలుసుకునేందుకు అక్కడి పలు రిజిస్ట్రర్లను పరిశీలించారు. మొత్తం మీద అన్ని విభాగాల్లోనూ సేవలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూ ఢిల్లీ నుంచి వచ్చిన చిన్నపిల్లల విభాగ నిపుణులు డాక్టర్ తరుణ్ కేఆర్ రవి, తిరుచ్చి నుంచి వచ్చిన డాక్టర్ అరవింద్ బృందం ఇక్కడ పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు మేరకు తాము ఈ తనిఖీలు చేస్తున్నామని, ఇక్కడి తాము పరిశీలించిన వాటిపై వారం రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్టు బృందం తెలిపింది. కార్యక్రమంలో స్థానిక చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ మమతా రాణి, డాక్టర్ భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఆత్మీయ స్వాగతం






మంత్రికి స్వాగతం పలుకుతున్న పలమనేరు, వి.కోట పార్టీ నాయకులు

పలమనేరు: గుడుపల్లె మండల పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, కౌన్సిలర్లు, నాయకులు బుధవారం పట్టణ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆత్మీయ స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు ఇచ్చి ఆయనతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, చెంగారెడ్డి, కోదండరామయ్య, రమేష్ రెడ్డి, నాగరాజు, శశి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి వి.కోటలో ఎంపీపీ యువరాజు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ తమీమ్, ముఖ్య నాయకులు కృష్ణమూర్తి, సుభాష్, సుధాకర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. కొంతసేపు మంత్రి వారితో మాట్లాడి కుప్పంకు వెళ్లారు.

రామకుప్పం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గుడుపల్లె పర్యటన సందర్భంగా బుధవారం రాజుపేట రోడ్డు సమీపంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ ఆరేళ్ల జయప్ప, మురుగేష్, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవ రెడ్డి, అప్పి, నారాయణస్వామి తదితరులు స్వాగతం పలికారు.

చవితి ఉత్సవాల నిర్వహణపై సీఐ సమీక్ష



మాట్లాడుతున్న సీఐ లింగప్ప

వి.కోట: స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రశాంత వాతావరణంలో వినాయకచవితి ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ లింగప్ప అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని అన్ని ఆలయాల ధర్మకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ పట్టణ ప్రముఖులు, ఆలయ ధర్మకర్తల సహకారంతో స్థానికంగా ఏర్పాటు చేసే వినాయకుని ప్రతిమలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిబంధనలకు ధర్మకర్తలు కట్టుబడి ఉండాలని, వాటిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన వస్తుందని హెచ్చరించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



పలమనేరు: పట్టణ సమీపంలోని కౌండిన్య నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. స్థానిక హైవే మీదుగా పట్టపగలే కొందరు ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై స్పందించిన స్థానిక పోలీసులు బుధవారం పట్టణ సమీపంలోని నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద దాడులు చేసి పలు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, కొందరు అధికార పార్టీ నాయకుల పేర్లను చెబుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు తెలిసింది. ఇలాంటి వారిపై చర్యలు తప్పవని పట్టణ సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు.

విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

పుంగనూరు: పుంగనూరులో దివంగత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ విగ్రహం ఏర్పాటుకు పూనుకుంటున్నట్టు బీజేపీ మైనార్టీ ముక్తి మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయూబ్‌ఖాన్ తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కలామ్ దేశ ప్రజలకు స్ఫూర్తిప్రదాత అని, ఆయన ఆదర్శవంతమైన వ్యక్తి అని అన్నారు. ఆయన విగ్రహం ఏర్పాటు భావితరాలకు మార్గదర్శకం అవుతుందని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఇదే విషయమై కమిటీలు ఏర్పాటు చేసి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సహకారంతో కలాం విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.

వాహనాల వేలం

పుంగనూరు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన వాహనాల వేలంలో రూ.1.06 లక్షల ఆదాయం లభించిందని సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఎస్‌ఈబీ ఏఈఎస్ బాబు శ్రీధర్ ఆధ్వర్యంలో 13 వాహనాలను, ఒక ఆటోను వేలం వేసినట్లు సీఐ తెలిపారు. వేలంలో వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని మద్యం అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన కారు, ద్విచక్ర వాహనాన్ని జిల్లా ఎస్‌ఈబీ ఏఈఎస్ బాబు శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వేలం వేశారు. వేలంలో రూ.36 వేల ఆదాయం వచ్చినట్టు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

కోర్టుల భద్రతపై పరిశీలన

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టులలో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై బుధవారం చిత్తూరు అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పరిశీలించారు. కోర్టులకు అవసరమైన ఏర్పాట్లను బృందం పరిశీలించింది, సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవ రావుతో అడిషనల్ ఎస్పీ సమావేశమయ్యారు. నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవరెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ శశికుమార్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ఎస్వీఎంఎస్ కాంప్లెక్స్‌లోని స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టును అడిషనల్ ఎస్పీ నాగేశ్వరావు, ఆడిటర్ నీలకంఠేశ్వరావు బుధవారం సందర్శించారు. అక్కడి న్యాయమూర్తి, సిబ్బందితో కలసి పలు విషయాలపై చర్చించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షల కోసమే కాంపిటేటివ్ సెల్

పలమనేరు: పోటీ పరీక్షల్లో శిక్షణ పొంది మంచి ర్యాంకు సాధిస్తేనే విజయం వరిస్తుందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ సెల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో మార్కులు సాధించి నిలవాలంటే ఇలాంటి ముందస్తు కోచింగ్ చాలా అవసరమన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం కళాశాలలో గ్రంథాలయాన్ని అందించిన రాజనీతిశాస్త్ర అధ్యాపకులు నాగరత్నం రెడ్డిని ఆయన అభినందించారు. విజయశేఖరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతోనూ భవిత



కబడ్డీ ఆడుతున్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల, విజలాపురం హైస్కూలు విద్యార్థులు



వాలీబాల్ పోటీలో తలపడిన కస్తూర్బా విజలాపురం, రామకుప్పం బాలికల హైస్కూలు విద్యార్థినులు

రామకుప్పం: క్రీడలతో కూడా భవితకు బాటలు వేసుకోవచ్చని మండల విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా మండల స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఈ పోటీలను ఎంఈఓ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజం, క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. అనంతరం అండర్-14, అండర్-17 బాల బాలికలకు వేర్వేరుగా వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వారిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ మణి, ప్రిన్సిపల్ రాజేంద్ర, ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణ రెడ్డి, మండలంలోని వివిధ హైస్కూళ్ల నుంచి దాదాపు 200మంది క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'తో లబ్ధి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు

పుంగనూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 'ఆయుష్మాన్‌భవ'తో ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ఆయుష్మాన్ భారత్' ఆరోగ్య పథకాల పోస్టర్లను మెడికలాఫీసర్ డాక్టర్ సృజన ఆధ్వర్యంలో తహసీల్దార్ సీతారామన్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డితో కలసి ఎంపీపీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఏఓ రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు మురళి, ఆనంద, సరస్వతి, హరినాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు ప్రభాకర్ నాయక్ పాల్గొన్నారు.

సకాలంలో పిల్లలకు టీకాలు



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. మండలంలోని నెల్లిపట్లలో ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా సర్వేతోపాటు ఇంటివద్దే వైద్య పరీక్షలు చేయిస్తోందన్నారు. తద్వారా వారి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. పిల్లలకు టీకాలు వేయిస్తే ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, కు.ని పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న బిడ్డమ్మ, వైస్ సర్పంచ్ నిరంజన్‌రెడ్డి, ఆరోగ్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్



చిన్నకొండామర్రిలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

చౌడేపల్లె: మండలంలోని గొర్రెలు, మేకల్లో చీడ పారుడు రోగ నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నట్టు పశువైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం చిన్నకొండామర్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 49,200 డోసుల వ్యాక్సిన్లు వేసేలా చర్యలు తీసుకున్నామని, వచ్చే నెల10వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగించనున్నట్టు చెప్పారు. ఈ వ్యాధి సోకితే అధిక జ్వరం, పలుచటి, నలుపు రంగుతో కూడిన విరోచనాలు, చిగుళ్లు, పెదాలు, నాలుక, నోటిపై పొక్కులు వచ్చి, వారం రోజుల్లో మూగజీవాలు మృత్యువాత పడుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు వేయించుకోవాలని కోరారు.